క్లుప్తంగా

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య

పాణ్యం: బడిఈడు పిల్లలందరు బడిలో ఉండాలని హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యావ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన సమూల మార్పులు దేశానికి ఆదర్శమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాధ్యతగా బడికి పంపాలన్నారు. చిన్నచిన్న కారణాలతో పిల్లలను బడి మాన్పించరాదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉసేన్‌బీ, ఎంపీడీఓ దస్తగిరి, ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఆదాయ వనరులు పెంచుకోవాలి

కల్లూరు: గ్రామాల్లోనే ఆదాయ వనరులు పెంచుకోవాలని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి సూచించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు (గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 6) గ్రామ పరిపాలన విధానంపై అవగాహన కల్పించారు. పంచాయతీలకు వచ్చే నిధులు, పనులు చేసే విధానం గురించి వివరించారు. పంచాయతీ కారదర్శి గ్రామానికి ఆదాయం సొంతంగా ఎలా పెంపొందించుకోవాలో తెలియజేశారు. సమావేశంలో పరిపాలన అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓఆర్డీ రవికిషోర్, సీనియర్ అసిస్టెంట్ పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

బెట్ట నివారణకు ప్రకృతి పద్ధతులు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

గడివేముల: బెట్ట నివారణకు ప్రకృతి పద్ధతులు పాటించాలని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు నరేంద్ర రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఎల్‌కే తండాకు చెందిన శంకర్‌నాయక్ పొలంలో కరువు నివారణ పద్ధతిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసారాన్ని పెంచుకుంటే వర్షాభావ పరిస్థితుల్లో బెట్టను తట్టుకుని పంటలు బాగా పండుతాయన్నారు. కార్యక్రమంలో ఏఓ హేమసుందర్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

'బాలభారతి' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న విజయభారతి

ఓర్వకల్లు: స్థానిక పొదుపులక్ష్మి ఐక్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలభారతి పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనపరచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ క్లామెట్ సత్యబాబు తెలిపారు. మంగళవారం విద్యార్థులను పాఠశాలలో సమాఖ్య గౌరవ సలహాదారు విజయభారతి అభినందించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రం శిరిడీలో జరిగిన జాతీయస్థాయి జంప్ రోప్ పోటీల్లో పాఠశాలకు చెందిన జోష్మిత, హర్షవర్ధన్ బంగారు పతకాలు సాధించగా, హరీష్, ఎస్ఎండీ ఫిరోజ్, హరికృష్ణ, మౌనిక కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు.

పకడ్బందీగా కుల గణన చేపట్టాలి

గూడూరు: కుల గణ న పకడ్బందీగా చేపట్టాలని ఏఎస్ఓ ఆదినారాయణ సూచించారు. పట్టణంలో వైకేపీ సమావేశ హాలో కుల గణనపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు మంగళవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమానికి తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ రాముడితో కలిసి ఆయన హాజయ్యారు. ఏఎస్ఓ మాట్లాడుతూ ఈ నెల 10 నుండి వారం రోజుల పాటు ఇంటింటికీ తిరిగి కుల గణన నిర్వహించాలన్నారు. సంబంధిత వ్యక్తులకు చెందిన కళ్లు, వేలి ముద్రలను ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

స్థలం వివాదంలో వ్యక్తిపై దాడి

ఆలూరు రూరల్: స్థలం వివాదంలో శ్రీనివాస్ అనే యువకుడిపై దాడికి పాల్పడిన సంఘటన మంగళవారం హత్తిబెళగల్ గ్రామంలో జరిగింది. శ్రీనివాస్ గ్రామంలో వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని జెడ్పీ పాఠశాలకు గతంలో సర్వే నంబర్ 932 సీలో 1.50 ఎకరాల స్థలాన్ని గ్రామ పెద్దలు విరాళంగా ఇచ్చారు. అయితే కొందరు వ్యక్తులు ఆ స్థలం తమకు సొంతమని, పట్టా ఉందని ఆక్రమించుకున్నారు. దీనిపై వలంటీర్ శ్రీనివాస్ బంధువు గాదిలింగ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మంగళవారం గ్రామానికి వెళ్లి వలంటీర్‌ను విచారణ చేశారు. స్థలం ఆక్రమించినట్లు ఫిర్యాదు చేస్తావా అంటూ శ్రీనివాస్‌పై గ్రామానికి చెందిన రాజశేఖర్, హరి, చంద్ర, రామకృష్ణ దాడి చేశారు. గాయపడిన శ్రీనివాస్‌ను కుటుంబసభ్యులు ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు.

పేదలకు అండగా జగనన్న ప్రభుత్వం

● ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



పేద మహిళలకు భూమి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: జగనన్న ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం కల్లూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రభుత్వ భూమి సాగు చేసుకుంటున్న భూమి లేని నిరుపేదలకు పట్టాల పంపిణీ, 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూములకు సంపూర్ణ భూమి హక్కు పత్రాలు పంపిణీ చేశారు.బస్తిపాడు, ఉలిందకొండ గ్రామాల పరిధిలోని 136 మంది లబ్ధిదారులకు 160.76 ఎకరాల భూమికి సంబంధించి పట్టాలు, 16 మందికి సంపూర్ణ భూమి హక్కు పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో ప్రతి పనిలో అవినీతి, అక్రమాలు ఉండేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవినీతికి తావులేకుండా పారదర్శంగా పథకాలను అమలు చేస్తోందన్నారు. టీడీపీ నేతల కల్లబొల్లి మాటలను నమ్మొద్దని సూచించారు. బడుగు బలహీన వర్గాలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలన్నారు. మరింత సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, ఉలిందకొండ, కే.మార్కాపురం సర్పంచ్‌లు సుంకులమ్మ, మద్దిలేటి, కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి, ఉలిందకొండ రమణారెడ్డి, ఎంపీటీసీ నాగేశ్వరావు, తహసీల్దార్ రమేష్ బాబు, ఎంపీడీఓ రమణమూర్తి, కల్లూరు అర్బన్ జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ హనుమంతురెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు సిటీ: మండల పరిధిలోని గొందిపర్ల దగ్గర నిర్మిస్తున్న 32 కేవీ స్విచ్చింగ్ స్టేషన్ కండక్టర్ మార్పు నిమిత్తం బుధవారం రామచంద్ర నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని ఇండస్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరాలలో అంతరాయం ఉంటుందని ఏఈ ఆంజనేయ శాస్త్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. పందిపాడుతోపాటు అథెనా స్కూల్, ఇండస్ స్కూల్, ఆర్టీసీ కాలనీ, నవత డీటీఆర్, మిస్టర్ ఇడ్లీ, లావా స్టోన్, బాలాజీ విల్లాస్, అపూర్వ విల్లాస్, అంబేడ్కర్ నగర్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఈ శ్రామ్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(రాజ్‌విహార్): ఈ శ్రామ్ కార్డులతో అసంఘటిత కార్మికులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని కార్మిక శాఖ కర్నూలు సహాయ కమిషనర్ కేశన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఈ కార్డు ఎంతో ఉపయోగపడుతుందని, కార్మికులకు సమీపంలోని సచివాలయం, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని కార్డు పొందాలని సూచించారు.

అర్హత ఉంటే ఇంటివద్దకే పథకాలు

గడివేముల: అర్హత ఉంటే ఇంటివద్దకే పథకాలు అందిస్తామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఒండుట్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని తెలియజేసి వివరాతో కూడిన బుక్‌లెట్లను అందజేశారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కొందరు రైతులు పొలాల ఆన్‌లైన్ సమస్య ఉందని ఫిర్యాదు చేయగా స్పందించిన ఎమ్మెల్యే వీలైనంత త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసులుకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి పారదర్శకంగా అమలు చేస్తున్నారన్నారు. లంచాలకు, వివక్షకు తావులేకుండా, కార్యాలయాల చుట్టూ తిరిగే దుస్థితి లేకుండా గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ కమిటీ జిల్లా చైర్మన్ శిరుప శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ శివ మల్లేశ్వరప్ప, ఏపీఎం హజరత్, వైస్ ఎంపీపీ కాలునాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్రారెడ్డి, మేఘనాథరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, శివానందరెడ్డి, నాగేశ్వరరెడ్డి, పుల్లయ్య, సుబ్బారెడ్డి, రఘుమాధవరెడ్డి, రాము, పార్టీ మండల కన్వీనర్ శివరామిరెడ్డి పాల్గొన్నారు.



బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి

సీఎం జగనన్నతోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యం



సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, అధికారులు

కర్నూలు సిటీ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని సామాజిక వర్గాల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్ తెలిపారు. మంగళవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని నిడ్జూరు గ్రామంలో జరిగిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం సర్పంచ్ మాధవి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి వైస్ వైస్ ఎంపీపీ నెహిమియా, మండల కన్వీనర్ మహబూబ్ బాషాతో కలిసి వారు హాజరయ్యారు. సచివాలయం పరిధిలో సంక్షేమం, అభివృద్ధి వివరాల బోర్డును వారు ఆవిష్కరించారు. సచివాలయం పరిధిలోని ప్రజలకు ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా రూ.14,49,17,142 కోట్లు, పరోక్షంగా రూ.3,03,25,075 కోట్లు మొత్తం రూ.17,52,42,167 కోట్లు లబ్ధి చేకూరిందని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ప్రజలను కోరారు. అనంతరం వలంటరీలకు సర్వే కిట్లను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కన్వీనర్ తిరుపతి రెడ్డి, ప్రసాద్, కె.సంపత్‌కుమార్, కో–ఆప్షన్ మెంబరు అల్లా వలీ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

● డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య



హెల్త్ కార్డు అందిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కల్లూరు: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ రామగిడ్డయ్య సూచించారు. మంగళవారం కే.మార్కాపురం గ్రామంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో పాల్గొని లబ్ధిదారులకు హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఉజ్వల్, ఆయుష్మాన్ భారత్ యోజన తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కే.నాగలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, సర్పంచ్ మద్దిలేటి, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత



మహబూబ్‌బీకి పింఛన్ అందిస్తున్న వలంటీరు శ్రీధర్



ఆసుపత్రిలో రోగెన్నకు పింఛన్ అందజేస్తున్న శివ

కోడుమూరు: మండల పరిధిలోని లద్దగిరి గ్రామానికి చెందిన వృద్ధుడు మాల రోగెన్న అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. వలంటీర్ మేకల శివ మంగళవారం కర్నూలు ఆసుపత్రికి వెళ్లి మాల రోగెన్న పింఛన్ సొమ్ము అందజేశారు.

ఆసుపత్రికెళ్లి పింఛన్ పంపిణీ

గడివేముల: అనారోగ్యంతో బాధపడుతూ ఓ మహిళలకు వలంటీర్ ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు. గడివేముల మండల కేంద్రానికి చెందిన మహబూబ్‌బీ కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ కర్నూలు పెద్దస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ శ్రీధర్ మంగళవారం ఆస్పత్రికి వెళ్లి వేలి ముద్రలు తీసుకుని పింఛన్ సొమ్ము అందజేశారు.

ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందిస్తాం

● నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ తెలిపారు. మంగళవారం సాయంత్రం తన చాంబర్‌లో కమిషనర్ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలను పోలింగ్ స్టేషన్ వారీగా పక్కా ప్రణాళికతో చేపడుతున్నట్లు చెప్పారు. ఏవైనా తప్పులు ఉంటే రాజకీయ పార్టీలు తమకు ఫిర్యాదు చేస్తే సరిచేస్తామన్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో అందరి అభిప్రాయాలు, సూచనలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే బీఎల్ఓల ద్వారా పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటర్ల గుర్తింపు ప్రక్రియ చేపడుతున్నట్లు చెప్పారు. పారదర్శకంగా రూపొందించడంలో సహకరించాలన్నారు.

విజయవాడకు ప్రతి రోజు రైలు నడపాలి

● పార్లమెంట్‌లో ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు నుంచి విజయవాడకు ప్రతి రోజు రెగ్యులర్‌గా రైలు నడపాలని ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ కోరారు. మంగళవారం ఆయన పార్లమెంట్ సమావేశాల్లో మాట్లాడినట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ తొలి రాజధాని కర్నూలు నుంచి విజయవాడకు రైలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. జిల్లా ప్రజలు వివిధ పనుల కోసం విజయవాడకు వెళ్తుంటారని, వీరి అవసరాల కోసం ప్రతి రోజు విశాఖపట్నం వరకు రైలు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనితో పాటు కర్నూలులో నిర్మిస్తున్న రైల్వే వర్క్స్ షాప్‌ను త్వరగా పూర్తి చేయాలని విన్నవించారు. వీటితో పాటు అనేక అంశాలను పార్లమెంట్‌లో ఆయన ప్రస్తావించారు.

'ఈ–హాస్పిటల్' పక్కాగా అమలు కావాలి



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఈ–హాస్పిటల్ విధానాన్ని పక్కాగా అమలు చేసి ప్రభుత్వ సర్వజన వైద్యశాలను రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో ఉంచాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి సూచించారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో వివిధ విభాగాల హెచ్ఓడీలతో ఆరోగ్యశ్రీ, ఈ–హాస్పిటల్‌లపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలోని పలు విభాగాల్లో ఆరోగ్యశ్రీ ప్రతి వారం ఇచ్చే లక్ష్యాలను పూర్తి చేసిన, ఆరోగ్యశ్రీ సేవలను మరింత పటిష్టంగా అమలు చేసిన విభాగాల హెచ్ఓడీలను అభినందించారు. ఆసుపత్రిలోని గైనిక్ విభాగం ఈ–హాస్పిటల్ అమలును మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. ఆసుపత్రిలో ఈ–హాస్పిటల్ అమలు 60 శాతం నుంచి 75 శాతం వరకు చేరడం అభినందనీయమన్నారు. కార్డియాలజీ, కార్డియోథొరాసిక్ విభాగంలో గత నెల 28న ప్రారంభమైన క్యాథలాబ్ సేవలు ఇప్పటి వరకు 28 యాంజియోగ్రామ్, మూడు బైపాస్ సర్జరీలు చేసినందుకు హెచ్ఓడీలను అభినందించారు. సమావేశంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని పాల్గొన్నారు.

వంద మందికి అసైన్‌మెంట్ భూముల హక్కులు

సి.బెళగల్: ఫ్రీ హోల్డ్ అసైన్‌మెంట్ భూములపై సంపూర్ణ హక్కులను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మండలంలో వంద మంది రైతులకు పట్టాలను మంజూరు చేసినట్లు తహసీల్దార్ శేషఫణి మంగళవారం ప్రకటనలో తెలిపారు. గత 20 ఏళ్లుగా డీ పట్టాలతో భూములు ఆదీన అనుభవంతో ఉన్న రైతులకు (2003 సంవత్సరం కంటే ముందు భూములు అసైన్ అయిన రైతులకు) సర్వ హక్కులు కల్పిస్తున్నామన్నారు. మండలంలోని మిట్ట సోమాపురం రెవెన్యూ గ్రామ పరిధిలో 10 మంది రైతులు, కొండాపురంలో 12 మంది, కొత్తకోటలో 26 మంది, బ్రాహ్మణదొడ్డిలో 36 మంది, గుండ్రేవులలో 16 మంది, పలుకుదొడ్డిలో ఇద్దరితో కలిపి మొత్తం 100 మంది రైతులకు సంబంధించిన 230 ఎకరాలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ పట్టాలను రైతులకు అందించడం జరుగుతుందని చెప్పారు.

ఇద్దరిపై కేసు నమోదు

గడివేముల: మండల కేంద్రానికి చెందిన దాసరి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య మంగళవారం తెలిపారు. శ్రీనివాసులు మోటార్ సైకిల్‌పై జెడ్పీ పాఠశాల నుంచి ఇంటికి వెళ్తుండగా మండల కేంద్రానికే చెందిన యాకూబ్ వలి, కొరప్రోలూరుకు చెందిన షేక్ మున్సూర్ మోటార్ సైకిల్‌తో ఢీకొట్టారన్నారు. ఈక్రమంలో వీరి మధ్య ఘర్షణ చోటుచేసుకోగా శ్రీనివాసులుపై దాడికి పాల్పడ్డారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉర్దూ హైస్కూల్ తనిఖీ

కర్నూలు సిటీ: పాత కంట్రోల్ రూం వద్ద ఉన్న ప్రభుత్వ బాలికల ఉర్దూ ఉన్నత పాఠశాలను మంగళవారం డిప్యూటీ ఈఓ హనుమంతరావు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. స్కూల్ రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని, హోంవర్క్‌ను సరిచూడాలని టీచర్లకు సూచించారు.

ఘనంగా స్టాంటన్ దొర జయంతి

కర్నూలు (టౌన్): స్థానిక కోల్స్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం స్టాంటన్ దొర జయంతిని జీసస్ సోల్జర్స్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఝాన్సీ రెవరెండ్ సంజీవరాజు తదితరులు కళాశాల ఆవరణలోని స్టాంటన్ దొర కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

కర్నూలు సిటీ: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడపలో ట్యాలీ, జీఎస్‌టీ, కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాసై, ఇంటర్మీడియెట్ పాస్/ఫెయిల్, డిప్లమా పాస్/ఫెయిల్, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన 18 ఏళ్ల నుంచి 26 ఏళ్ల వయస్సు ఉన్న వారు శిక్షణకు హాజరు కావచ్చన్నారు. 35 రోజుల కోర్సుల్లో ట్యాలీ+ జీఎస్‌టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిషు, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్‌స్కిల్స్, ఇంటర్వ్యూస్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. శిక్షణ అనంతరం 100 శాతం ఉపాధి అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 9000487423ను సంప్రదించాలన్నారు.

'హంద్రీ-నీవా'లో యువతి మృతదేహం

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల పరిసరాల్లో ప్రవహిస్తున్న హంద్రీ–నీవా ప్రధాన కాలువలో మంగళవారం మధ్యాహ్నం ఓ యువతి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి, పరిశీలించారు. లభ్యమైన ఆధారాలను బట్టి మృతురాలు కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం గుమ్మనూరుకు చెందిన శ్యామల (22)గా గుర్తించారు. ఈ నెల 2న ఆమె అదృశ్యమైనట్లు చిప్పగిరి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందిందా? లేక ఆత్మహత్య చేసుకుందా? అనే కోణంలో వజ్రకరూరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ బొంతల మునెప్ప

సి.బెళగల్: ఉద్యోగులు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఎంపీపీ బొంతల మునెప్ప సూచించారు. ఈఓఆర్డీ సందీప్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీలు, సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్ – 3 నుంచి గ్రేడ్ – 6 వరకు పంచాయతీ కార్యదర్శుల (పీఎస్‌ల)కు నిర్వహించిన ఒక్క రోజు శిక్షణా కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణపై శ్రద్ధ వహించి, ఎప్పటికి అప్పుడు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ పంచాయతీల ఆదాయం పెంపుపై పీఎస్‌లు దృష్టి సారించాలని సూచించారు. పంచాయతీలు, రికార్డుల నిర్వహన, పీఆర్ చట్టాలు, విధుల అమలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలను ఈఓఆర్డీ వివరించారు.

గ్లో గార్డెన్ వేలానికి విశేష స్పందన



బహిరంగ వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ రెవెన్యూ అధికారులు

కర్నూలు (టౌన్): నగరంలోని ఎస్‌బీఐ సర్కిల్ వద్ద ఉన్న చిల్డ్రన్ పార్కును గ్లో గార్డెన్‌గా నగరపాలక సంస్థ అభివృద్ధి చేసింది. ఈ గార్డెన్‌లో రెస్టారెంట్, ఫుడ్ కోర్టు, ఇండోర్, ఔట్‌డోర్ గేమ్స్, విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దేందుకు రెవెన్యూ విభాగం మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ, రెవెన్యూ అధికారి జునీద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాజు, మన్సూర్, వాజిద్, సుహేయిల్ పాల్గొన్నారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వేలం వివరాలు, పాల్గొన్న వారి వివరాలు, ధరవత్తు తెలియజేస్తూ వేలం నిర్వహించారు. గ్లోగార్డెన్‌లోని 5 షాపులు, పార్కులోకి ప్రవేశం కోసం పిల్లలకు రూ.5, పెద్దలకు రూ.10, గార్డెన్ క్లీనింగ్, ఉదయం, రాత్రి వేళల్లో వాచ్‌మెన్, కరెంటు చార్జీలు చెల్లిస్తూ ప్రతినెల రూ.60 వేల బాడుగ చెల్లించాల్సి ఉంటుంది. గుడ్ విల్ రూ.2 లక్షలకు పైగా పాటదారులకు పోటీ నిర్వహించారు. పాటదారులు పోటీ పడ్డారు. గ్లో గార్డెన్ వేలాన్ని దక్కించుకునేందుకు మంజునాథ్ సర్వీసెస్ రూ1.25 కోట్లు పాట పాడి వేలం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గ్లో గార్డెన్ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఆవరణలోని ఏ చెట్టును నరకకూడదని, ప్రతి నెల 10వ తేదీలోపు అద్దె చెల్లించాలని సూచించారు.

'నా అనుభవాలు–జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: బహుజన ఉద్యమ నేత నక్కల మిట్ట శ్రీనివాసులు ఆత్మకథ 'నా అనుభవాలు – జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఈనెల 10న నిర్వహించనున్నట్లు నక్కలమిట్ట ఫౌండేషన్ ప్రతినిధి నక్కల మిట్ట నందన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారికి నక్కల మిట్ట ఫౌండేషన్ వారి జీవిత సాఫల్య పురస్కారాల ప్రదానం జరుగుతుందన్నారు. సామాజిక రంగం నుంచి మాజీ ఎంపీ బుట్టా రేణుక, వైద్య రంగంలో డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, నాటక రంగంలో పత్తి ఓబులయ్య, సేవా రంగంలో ముత్తు లక్ష్మి, సాహిత్య రంగంలో ఎస్.డి.వి. అజీజ్‌లకు నక్కలమిట్ట ఫౌండేషన్ వారి జీవిత సాఫల్య పురస్కారం–2023ను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కర్నూలు ఎంపీ డాక్టర్ ఎస్.సంజీవ్‌కుమార్, మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎంపీ బుట్టా రేణుక, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ హాజరు కానున్నట్లు తెలిపారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

కర్నూలు(అర్బన్): మిచాంగ్ తుపాన్ కారణంగా జిల్లాలో వర్షాలు కురుస్తుండడం వల్ల అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచు, వార్డు సభ్యులు, ఏఎన్ఎం, హెల్త్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లతో సమావేశాలు నిర్వహించి అవసరమైన చర్యలు చేపట్టాలని డీఎల్‌పీఓలకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. వీధులు, రోడ్లకు ఇరువైపులా శుభ్రం చేయడం, చెత్త కుప్పలు, పిచ్చి మొక్కలను తొలగించడం, డ్రైనేజీ కాలువలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను శుభ్రం చేయాలని సూచించామన్నారు. డీఎల్‌పీఓలు అప్రమత్తంగా ఉండి క్షేత్ర స్థాయిలోని ఈఓఆర్డీ, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో కార్యక్రమాలను చేపట్టేలా చర్యలు తీసుకున్నామన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలక్రీడా పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని ఈఎస్సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉమ్మడి కర్నూలు జిల్లాలకు చెందిన పాలిటెక్నిక్ కళాశాలల బాలబాలికల ఆటల పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో 11 పాలిటెక్నిక్ కళాశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. డిప్యూటీ సీఈఓ రాముడు, జేఎస్ డబ్ల్యూ సిమెంట్ మేనేజర్ లక్ష్మణస్వామి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

కర్నూలు(రాజ్‌విహార్): వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ (తిరుపతి) కె.శివప్రసాద్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన స్థానిక పవర్ హౌస్ సెక్షన్ కార్యాలయంలో మీటర్స్ యాప్ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరఫరాలో పారదర్శకత, సేవల పరిశీలన కోసం కొత్తగా యాప్‌ను తీసుకొచ్చినట్లు చెప్పారు.

నెల్లూరుకు విద్యుత్ ఉద్యోగులు



నెల్లూరులో కలెక్టర్ హరినారాయణతో కలిసి విద్యుత్ పనులు పరిశీలిస్తున్న ఎస్ఈ ఉమాపతి

కర్నూలు(రాజ్‌విహార్): మిచాంగ్ తుపాన్ ప్రభావంతో నెల్లూరు జిల్లాలో అస్తవ్యస్తమైన విద్యుత్ సరఫరా వ్యవస్థను పునరుద్ధరించేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యుత్ ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు ఆదేశాల మేరుకు కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతితో పాటు ఏడీఈలు రంగస్వామి, ఎల్లప్ప, సుబ్రహ్మణ్యంతో పాటు ఇద్దరు ఏఈలు, ఇద్దరు ఏడీఈలు, 145 మంది లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, జూనియర్ లైన్‌మెన్లు, కాంట్రాక్టు సిబ్బంది నాలుగు బృందాలుగా సోమవారం అర్ధరాత్రి నెల్లూరు జిల్లాకు బయలుదేరి వెళ్లారు. విద్యుత్ మరమ్మతు పనులు పూర్తయ్యాక తిరిగి కర్నూలుకు రానున్నారు.